క్లుప్తంగా

యువతి అదృశ్యం: కేసు నమోదు

రాజాపూర్: యువతి ఇంట్లో నుంచి వెళ్లిపోయి అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గుండ్లపొట్లపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి, మల్లయ్య కూతురు మానస డిగ్రీ రెండో సంవత్సరం మధ్యలో చదువు మానేసి ఇంటివద్దనే ఉంటోంది. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసిన అనంతరం నిద్రకు ఉపక్రమించారు. మధ్య రాత్రి లేచి చూస్తే మానస లేకపోవడంతో చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. బంధువుల వద్ద కూడా విచారించగా సమాచారం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

గ్రాడ్యుయేషన్ డే



జడ్చర్ల టౌన్: మండలంలోని రామస్వామిగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు పట్టాలు (మార్కుల పత్రాలు) అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, ప్రధానోపాధ్యాయుడు రవి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతప్ప విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు బడి వద్దు.. ప్రభుత్వ బడి ముద్దు

రాజాపూర్: గ్రామాల్లో చక్కటి సర్కారు బడి ఉండగా, పైసలు పెట్టి తమ పిల్లలను ప్రైవేటు బడిలో చేర్పవద్దని మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లేపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. నేడు ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌గౌడ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద మైనార్టీల మేలు కోసమే వక్ఫ్‌బోర్డు సవరణ

పాలమూరు: పేద మైనార్టీ వర్గాలకు మేలు జరిగేందుకే వక్ఫ్ బోర్డు సవరణ చేయడం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర సంయుక్త కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వక్ఫ్ అనేది ఇస్లామిక్ చట్టాల ప్రకారం రూపొందించిన ధార్మిక సంస్థ అని, ఇస్లామిక్ చట్టం 1995 ప్రకారం భారతదేశం దీనిని నిర్వహిస్తోందన్నారు. ఇప్పటికే 31శాతం మైనార్టీలు దరిద్రరేఖకు దిగువన జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతల ప్రద్యుమ్నారెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న వ్యక్తులపై కేసు నమోదు

నవాబుపేట: మండలంలోని దేపల్లి గ్రామంలో రోడ్డు పనులకు టిప్పర్లతో మొర్రం తరలిస్తుండగా, వాటిని అడ్డుకుని పనులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మంగళవారం దేపల్లి గ్రామానికి చెందిన రాపోలు దామోదర్, గట్టం బాలకిష్టయ్య, చెన్నగల్ల హన్మయ్య, వెంకటేష్‌లు గ్రామంలోని రోడ్డు పనులకు దేపల్లి గేట్ నుంచి గ్రామానికి మొర్రం తరలిస్తుండగా టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో బాధితుడు యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అభివృద్ధి పనులను అడ్డుకోవటంతో పాటు పనులకు సంబంధించిన శిలాఫలకం ధ్వంసం చేయటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో క్రీడాదినోత్సవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వార్షిక క్రీడాదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి షాద్‌నగర్ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు శ్రీనివాసులు, పూర్వవిద్యార్థి కాల్వరాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. ఈ ఏడాది చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

14వ వార్డులో సీసీరోడ్డు పనులు ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు నల్లకుంటలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత మంగళవారం భూమిపూజ చేశారు. సీసీరోడ్డు త్వరితగతిన, నాణ్యతతో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతరను జయప్రదం చేయండి

దేవరకద్ర: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 26న జరిగే అంబేడ్కర్ జాతరను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దొబ్బలి ఆంజనేయులు కోరారు. మంగళవారం దేవరకద్ర అంబేడ్కర్ భవన్ వద్ద జాతర కరపత్రాలను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బహుజనులు తరలి రావాలని పిలుపు నిచ్చారు.

సత్తాచాటిన సర్కార్ కళాశాలలు

- ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు
- మైనార్టీ, కస్తూర్బాలలో పెరిగిన ఉత్తీర్ణత


అయేషా సిద్దిఖి (986)


పురుషోత్తం (966)


లావణ్య (993)


అంకిత (988)


శయస్త జువేరియా (985)


అర్చన (983)


కె.అంజలి(979)


మణికంఠ(928)


సుమయ (950)


సుప్రియ (987)


ప్రవీణ్ (ఒకేషనల్)


సిద్దార్థ (ఒకేషనల్)


ప్రవళిక(968)


శివాణి (954)


నౌరిన్

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వం కళాశాలలు, మైనార్టీ, కస్తూర్బాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ప్రైవేట్ కళాశాలలకు దీటు ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత సాధించారు.

- జడ్చర్ల పట్టణంలో ప్రభుత్వ కళాశాలలు, గురుకులాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 283మంది విద్యార్థులకు గానూ 126మంది (44.52శాతం), ద్వితీయ సంవత్సరంలో 162మంది విద్యార్థులకు గాను 108మంది (66.67శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ తెలిపారు.
- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 77శాతం ఫలితాలు వచ్చాయి. ద్వితీయ సంవత్సరంలో 162మందికి 133మంది ఉత్తీర్ణత కాగా, 82శాతం ఫలితాలు వచ్చాయి. ప్రథమ సంవత్సరంలో 203మందికి 148మంది ఉత్తీర్ణత పొందగా 73శాతం ఫలితాలు వచ్చాయి.
- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 85 శాతం ఫలితాలు వచ్చాయి. ద్వితీయ సంవత్సరంలో 48మందికి గానూ 40మంది ఉత్తీర్ణత పొందారు.
- చిట్టెబోయిన్‌పల్లి గురుకుల పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో మొత్తం 79మంది పరీక్షకు హాజరు కాగా, అందరు ఉత్తీర్ణత పొందారు. ఎంపీసీ విభాగంలో లావణ్య 993, సరిత 991 బైపీసీలో అంకిత 988 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ప్రథమ ఏడాదిలో ఎంపీసీలో రాణి, ఎల్లమ్మ, అనూషలు 467 మార్కులు సాధించారు. బైపీసీలో గీత 466 మార్కులు సాధించింది. ఏ మేరకు ప్రిన్సిపాల్ అనిత విద్యార్థులను అభినందించారు.
- మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల స్కూల్‌లో ద్వితీయ ఏడాదిలో 56 మంది పరీక్షకు హాజరు కాగా అందరు ఉత్తీర్ణత పొందారు. ప్రథమ సంవత్సరంలో 59 మందికి 57మంది ఉత్తీర్ణత పొందారు. బైపీసీ విభాగంలో శయస్త జువేరియా 985, ఎంపీసీ విభాగంలో పి. అర్చన 983 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.
- మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 38.62 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య. తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కె.అంజలి 979 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారని, మణికంఠ 928 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు.
- భూత్పూర్ మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే బాలికల కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో జి.శివాని ఎంపీసీలో 983/1000 సాధించగా, బైపీసీలో జి.సుప్రియ 987/1000 టాపర్లుగా నిలిచారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎస్. తేజస్విని 464/470, బైపీసీలో కళ్యాణి 434/440 సాధించగా, ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఎం. శ్రావణి 485/500 మార్కులు సాధించారు.
- నవాబుపేట మండలం యన్మన్‌గండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్‌లో 94 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకుని టాప్‌లో నిలిచింది.
- మూసాపేట మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీలో ఇంటర్ ఫలితాల్లో 99.04 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం బాలికలు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం బాలికలు 98.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 59 మంది బాలికలకు గాను 58 మంది బాలికలు పాసయ్యారు. రెండో సంవత్సరంలో 47 మంది బాలికలకు గాను 47 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో ప్రవళిక 968 మార్కులు, ఎంపీసీలో శివాణి 954 మార్కులు సాధించినట్లు ప్రత్యేకాధికారిని ఆర్.పావని సింగ్ తెలిపారు.
- బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఫలితాలు సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో 38 మంది విద్యార్థులకు అందరు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 35 మంది పరీక్షలు రాయగా, 35 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94.5 శాతం ఫలితాలు వచ్చాయి. ఎంపీసీలో కావలి లావణ్య 954 మార్కులు, బైపీసీలో స్వాతి 945 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.
- చిన్నచింతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో నౌరిన్, భానుప్రకాష్‌లు మొదటి స్థానంలో నిలిచారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి


భూత్పూర్‌లో భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

భూత్పూర్: దీర్ఘకాలికంగా ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే భూ భారతి చట్టం తీసుకొచ్చినట్లు రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, కల్చరల్ శాఖ మంత్రి జూపలి కృష్ణారావు అన్నారు. మంగళవారం భూత్పూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఆర్డీఓ నవీన్‌కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావులతో కలిసి మంత్రి జూపల్లి మాట్లాడారు. ధరణి చట్టం గత ప్రభుత్వం తీసుకరావడంతో పట్టదారుడికి పూర్వీకుల నుంచి సంక్రమించాల్సిన భూమి రకరకాల సమస్యల కారణంగా రైతులు మనోవేదనకు గురయ్యారని, ఆత్మహత్యలు చేసుకున్నారని, పహాని వ్యవస్థను పునరుద్ధరించడానికి భూ భారతి చట్టం ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి అన్నారు. భూ భారతి చట్టంతో రైతులకు 30 రోజులు గడువు ఇవ్వడం జరుగుతుందని, గతంలో ఉన్న దరఖాస్తు పెట్టుకున్న వారు, ప్రస్తుతం దరఖాస్తు పెట్టుకుంటే అన్యాయం జరిగితే దరఖాస్తును తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ పరిధిలో ఉంటే తహసీల్దార్ భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని మంత్రి చెప్పారు. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు భూ సమస్యలపై సెల్‌ఫోన్‌లో వాట్సాప్, మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి భూ భారతి ద్వారా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతుల భూమి సమస్య పరిష్కారం అవుతుందో కాదో దరఖాస్తు దారునికి వెంటనే తెలియజేయాలని, దరఖాస్తు దారుని సమస్య నిజమైతే 30 రోజుల్లో చేయకపోతే సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, జిల్లా నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జిపై గడ్డర్ల బిగింపునకు శ్రీకారం


ట్రయల్ రన్‌లో భాగంగా గడ్డర్‌ను ఎత్తుతున్న క్రేన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ వద్ద రైల్వే బ్రిడ్జిపై గడ్డర్ల బిగింపునకు మంగళవారం చేసిన ప్రయత్నం సఫలీకృతమైంది. రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని ఓవైపు పూర్తిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా 36 మీటర్ల పొడవుగల 5 స్టీల్ గడ్డర్లు తీసుకువచ్చారు. వాటిని ఇదివరకే నిర్మించిన సిమెంట్ వాల్స్‌పై బిగించనున్నారు. ఒక్కో గడ్డర్ బరువు 100 టన్నుల వరకు ఉంటుంది. గడ్డర్ల బిగింపునకు గాను 300 టన్నుల సామర్థ్యం గల రెండు భారీ క్రేన్లు తీసుకువచ్చారు. వీటితో పాటు హైడ్రాలిక్ క్రేన్, రెండు జేసీబీలు, ఒక హిటాచీ సహాయం తీసుకుంటున్నారు. మంగళవారం నుంచే పనులు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ.. రైల్వే అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో బుధవారానికి వాయిదా పడింది. రెండు రోజుల్లో గడ్డర్లను రైల్వే లైన్‌పై బిగించేలా ప్రణాళికలు రూపొందించారు. ఆ తర్వాత ఇంటర్నల్ డయాఫ్రేమ్స్, ఎండ్ డయాఫ్రేమ్స్, బాటమ్ లెవల్ ఫ్రేమ్స్ బిగించేందుకు మరో వారం రోజుల సమయం తీసుకోనున్నారు. ఈ పనులు జరిగే సమయంలో రైళ్ల రాకపోకల వేగం తగ్గించనున్నారు. ట్రయల్ రన్ పనులను సదరు కంపెనీ సీఈఓ చంద్రశేఖర్, రైల్వే బ్రిడ్జి ఇంజినీర్, ఎస్‌హెచ్ ఏఈ రవికుమార్ పర్యవేక్షించారు. గడ్డర్ల బిగింపు సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని సీఐ కమలాకర్‌ను కోరినట్లు ఎస్‌హెచ్ అధికారులు తెలిపారు. అదే విధంగా పనులు కొనసాగుతున్న ప్రాంతంలో ఉన్న టీవీ, ఇంటర్నెట్ కేబుల్ తొలగించాలని అధికారులు కోరారు.

పెద్ద శివాలయం అభివృద్ధికి కృషి


వీరన్నపేట లో అధునాతన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వీరన్నపేటలోని పెద్ద శివాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ ఆవరణలో షెడ్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎ.అంజయ్యకు సూచించారు. దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ మదన్‌మోహన్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, మోసిన్, రఘు, శ్రావణ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా 'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో మండల ప్రత్యేక అధికారు లు, ఎంపీడీఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం దర ఖాస్తు చేసుకున్న వాటిని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి స్పెషల్ అధికారులు, ఎంపీడీఓలు వె రిఫై చేయాలని, అర్హులైన వారి దరఖాస్తులు జిల్లా స్థాయికి పంపిస్తే ఇక్కడ వెరిఫై చేసి సాంక్షన్ చేస్తామన్నారు. అంతకుముందు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీసీ నిర్వహించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో బేస్మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి మొదటి విడత కింద లక్ష రూపాయలు ఇటీవల విడుదల చేశామన్నారు. వర్షాకాలం ప్రారంభం కంటే ముందే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్ రెడ్డి, గృహ నిర్మాణ పీడీ వైద్యం భాస్కర్, సీపీఓ రవీందర్, ఇండస్ట్రీస్ జీఎం, డీడీ హార్టికల్చర్ వేణుగోపాల్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిర ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.


వరిధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

- చేవెళ్ల ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి



మహమ్మదాబాద్: వరిధాన్యం కొనుగోళ్ల సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని చేవెళ్ల ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వడగళ్ల వర్షానికి ధాన్యం తడిసి రైతులు అవస్థలు పడుతుండటంతో ఎంపీ మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు పడుతున్న అవస్థలను స్వయంగా అడగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం



చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి ఆరోపించారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం గూడూరులో రైతులు కళ్లాలో ఆరబోసిన వరి ధాన్యాని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వరి కొనుగోలులో నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మోహన్‌గౌడ్, రుణాకర్‌రెడ్డి, కోట రాము, రవీందర్‌రెడ్డి, వట్టెం రాములు ఉన్నారు.

పోషకాహార లోపాలను అరికట్టాలి


పోషణ పక్షం కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం


మహబూబ్‌నగర్ రూరల్: పోషకాహార లోపాలను అరికట్టాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో పోషణ పక్షం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను డీడబ్ల్యూఓ, ఇతర అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, ఆయా ప్రాజెక్టుల సీడీపీఓలు రాధిక, శైలాశ్రీ, కమల, ఏసీడీపీఓ వెంకటమ్మతో పాటు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

- పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ కల్పన పేర్కొన్నారు. జడ్చర్ల మండలంలోని కోడ్గల్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు.

ఆర్‌ఐపై ఫిర్యాదు

నవాబుపేట: తన పేరున ఉన్న భూమి మిస్సింగ్ అయ్యిందని, ఆ భూమి తనకు చేయాలంటూ ఆర్‌ఐని సంప్రదిస్తే తనతో డబ్బులు తీసుకుని భూమి చేయలేదంటూ గిరిజన మహిళ మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ సువర్ణకు ఫిర్యాదు చేసింది. మండల పరిధిలోని ఊరంచుతండాకు చెందిన కెతావత్ సక్లిబాయి 58(1), 59(2) సర్వే నంబర్లతో ఎకరం 27 గుంటల భూమిని 25 ఏళ్ల క్రితం కొనుగోలు చేసింది. కాని అందులో తన మరిది పేరిట 33 గుంటల భూమిని పట్టా చేయగా, ఆమెకు మాత్రం 24గుంటల భూమిని చేసి 10 గుంటల భూమిని మిస్సింగ్ చేశారు. తీర తన కుమారుడికి భూమి పట్టా చేద్దామని వెలితే తన పేర ఉండాల్సిన భూమి కంటే 10 గుంటలు తక్కువ వచ్చింది. దీంతో నవాబుపేట రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఐ కిరణ్‌ను కలిసి భూమి చేయాలని కోరితే రూ.50 వేలు అడ్వాన్స్‌గా తీసుకుని పని చేయలేదని మహిళ వాపోయింది. తన భూమిని తనకు చేయకుండ మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదులో కోరింది. విచారణ జరుపుతామని డీటీ వివరించారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మిడ్జిల్: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి తీసుక రావడం జరిగిందని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎంవీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన భూ భారతి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న ధరణి సమస్యలు పూర్తి స్థాయి లో పరిష్కారం కాకపోవడంతో, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రభుత్వం భూ భారతి కార్యక్రమం తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ అనిల్‌కుమార్, జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజు, నాయకులు రబ్బాని, శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్‌యాదవ్, నిత్యానందం, సత్యం, బంగారు, శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కితీసుకునే వరకు నిరసన

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెనక్కితీసుకునే వరకు నిరసన చేపడుతామని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మైనార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద ముస్లింల సంక్షేమం కోసం చాలా మంది దాతలు ఆస్తులు, భూములను అల్లా పేరుతో వక్ఫ్ చేస్తారని, ఈ వక్ఫ్‌లో కేంద్ర ప్రభుత్వం పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టడానికి కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా 26న సాయంత్రం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభకు ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మే 1నుంచి కరాటే శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో వచ్చేనెల 1వ తేదీ నుంచి వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ మాస్టర్ ఎతినె చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శేషజీవితం ఆరోగ్యంగా ఉండాలి



మహమ్మదాబాద్: పదవీ విరమణ అనంతరం శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలని మండల విద్యాధికారి రాజునాయక్ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం బాల్‌రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మొకర్లాబాద్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు పెంటయ్య పదవీవిరమణ సందర్భంగా దంపతులను ఘనంగా సన్మానించారు. నేటి విద్యార్థులు కూడా గురువులను పదిలంగా చూసుకుని వారినుంచి ఎంతో నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు జీ మదన్‌మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఎంఎస్‌ఓ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, జీహెచ్‌ఎం వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హజ్‌యాత్రికులకు వ్యాక్సినేషన్ క్యాంప్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈ ఏడాది పవిత్రహజ్‌కు వెళ్తున్న జిల్లా యాత్రికులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహించారు. 204 మంది యాత్రికులకు వ్యాక్సినేషన్ అందజేశారు. జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు మహమూద్‌అలీ మాట్లాడుతూ ఈ ఏడాది సొసైటీ ఆధ్వర్యంలో హజ్‌యాత్రికులకు యాత్రపై సంపూర్ణ అవగాహన కోసం శిక్షణా శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ పద్మజా, డాక్టర్ రఫిక్, డాక్టర్ అబ్దుల్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ గౌతమి, డాక్టర్ అబ్దుల్ సమీ, డాక్టర్ ముబషిర్ హుస్సేన్, డాక్టర్ మహ్మద్ నవాజ్, డాక్టర్ అయేషా తంజిలా, డాక్టర్ అజ్గరి సుల్తానా, డాక్టర్ ఎండీ.ఆరిఫ్‌తో పాటు జిల్లా హజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎండీ మేరాజుద్దీన్, రవూఫ్ పాష, సత్తార్, మహ్మద్ రఫిక్, ఖాజా నిజాముద్దీన్, మహ్మద్ ఫైజొద్దీన్ పాల్గొన్నారు.

చట్టానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: తమిళనాడు, బెంగాల్ సీఎంలు వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకమని ప్రకటించారని, రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి కూడా ప్రకటన చేయడంతో పాటు అసెంబ్లీలో ఈ చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింలను లక్ష్యంగా చేసుకొని వక్ఫ్ బోర్డు సవరణ చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టానికి రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీలు వ్యతిరేకించారని గుర్తుచేశారు. భవిష్యత్తులో క్రిస్టియన్, జైన్, సిక్కులు, దళితులను కూడా కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేయనుందన్నారు. అందరం ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నయీం ఇమ్రాన్, హాఫీజ్ ఇద్రీస్, బాష్వార్, జహంగీర్‌ఖాన్, ఇబ్రాహీం, సున్ని అబ్దుల్లా, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ హోం సందర్శించిన న్యాయమూర్తి



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ సమీపంలో ఉన్న చిల్డ్రన్ హోం, స్టేట్ హోం, శిశుగృహాలను మంగళవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్థానికంగా చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. అనంతరం నల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీస్‌పై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో యాక్ట్‌పై వివరించారు. విద్యార్థులకు, చిన్నారులకు ఏదైనా న్యాయ సమస్యలుంటే న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.